

నివాసాలపై మూకుమ్మడి దాడి

కర్నూలు ఏ. జీ. సీ క్యాంపుల్లోని క్వార్టర్లలో అనధికారికంగా నివాసాలు ఉన్న వారిని ఖాళీ చేయించేందుకు ప్రభుత్వ అధికారులు దాడులు నిర్వహించారు. 8లో▸



అన్నప్రసాద వితరణకు విరాళం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న అన్నప్రసాద వితరణకు సోమవారం కర్నూలుకు చెందిన వి.రాజశేఖరరెడ్డి రూ.1,00,116 విరాళాన్ని పర్యవేక్షకులు కె.శివప్రసాద్‌కు అందించారు.



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	:1,633 అడుగులు
ప్రస్తుతం	:1,626.06
టీఎంసీల సామర్థ్యం	:105.788
ప్రస్తుతం	:80.003
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	:42,965
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	:40,081

న్యూస్‌రీల్

లైంగిక వేధింపులపై తక్షణమే చర్యలు

కర్నూలు(సెంట్రల్): అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో లైంగిక వేధింపులపై తక్షణమే చర్యలు తీసుకునే విధంగా అంతర్గత ఫిర్యాదు కమిటీలను ఏర్పాటు చేయాలని అధికారులను జేసీ డాక్టర్ బి.నవ్య ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో సోమవారం పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పనిప్రదేశాల్లో మహిళలకు సురక్షిత వాతావరణం కల్పించడం ఆయా సంస్థల ప్రధాన బాధ్యత అన్నారు. వివాహానికి ముందు జంటలు తమ సంబంధాలను మెరుగుపరచుకోవడానికి, సమస్యలను చర్చించుకోవడానికి, భవిష్యత్ సవాళ్లను ఎదుర్కోవడానికి వన్ స్టాప్ సెంటర్ల ద్వారా ప్రీ మార్టియల్ కౌన్సెలింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. డీఆర్వో సి.వెంకటనారాయణమ్మ, హౌసింగ్ పీడీ చిరంజీవి, ఐసీడీఎస్ పీడీ విజయ, మిషన్ కో ఆర్డినేటర్ బాలమణి, వన్‌స్టాప్ సెంటర్ అడ్మిన్ పి.మేరి స్వర్ణలత పాల్గొన్నారు.

జిల్లా అంధత్వ నివారణ అధికారిగా హిమబిందు

కర్నూలు(హాస్పిటల్): జిల్లా అంధత్వ నివారణ సంస్థ (డీబీసీఎస్) అధికారిగా డాక్టర్ ఎ.హిమబిందు నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు జీవో ఆర్‌టీ నెం.581 ద్వారా ఉత్తర్వులు జారీ చేశారు. నంద్యాల జిల్లాలో నేషనల్ ప్రోగ్రాం ఫర్ కంట్రోల్ బ్లెండ్‌నెస్ (ఎన్‌పీసీబీ) అధికారిణిగా పనిచేస్తున్న ఆమె మెడికల్ గ్రౌండ్స్ కింద కర్నూలు జిల్లాకు బదిలీ చేశారు. ఇప్పటి వరకు జిల్లా అంధత్వ నివారణ అధికారిగా డాక్టర్ సంధ్యారెడ్డి బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

హిజ్రాలకు ఉపాధి కోర్సులు

కర్నూలు(అర్బన్): జిల్లాలో విద్యావంతులైన హిజ్రాల (ట్రాన్స్ జెండర్స్) ఉపాధి కోసం నైపుణ్య అభివృద్ధి కోర్సుల్లో ఉచిత శిక్షణను అందించనున్నట్లు విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు రయిస్‌ఫాతిమా సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 21వ సెంచరీ సాఫ్ట్‌వేర్ సోల్యూషన్స్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థ ఆధ్వర్యంలో పోటీ పరీక్షలు కూడా నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఇంటర్మీడియట్, డిగ్రీ ఉత్తీర్ణులు ఇంగ్లిషు, తెలుగులో ప్రాథమికంగా చదవడం, రాయడం వచ్చిన వారు అర్హులని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు తమ కార్యాలయం నంబర్ 08518-277864లో సంప్రదించాలన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు(అర్బన్): జిల్లాలో ఎనిమిది అంగన్‌వాడీ కార్యకర్తల, 49 అంగన్‌వాడీ ఆయాల పోస్టులు ఖాళీగా ఉన్నాయని, ఈ పోస్టుల భర్తీకి స్త్రీ అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మహిళా శిశు సంక్షేమ సాధికారత అధికారిణి పీ విజయ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అంగన్‌వాడీ కార్యకర్త పోస్టుకు 10వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలన్నారు. ఆయా పోస్టులకు 7వ తరగతి పాస్ అయి ఉండాలన్నారు. వయస్సు 1/7/2025 నాటికి 21 సంవత్సరాలు నిండి 35 సంవత్సరాల లోపు ఉండాలన్నారు. వివాహమై అదే గ్రామంలో నివశించు వారై ఉండాలన్నారు. నియామకాల్లో రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటిస్తామన్నారు. ఖాళీల వివరాలకు సంబంధిత సీడీపీఓ కార్యాలయాల్లో సంప్రదించాలని, ఆయా కార్యాలయ నోటీసు బోర్డుల్లో కూడా చూసుకోవాలన్నారు. మరిన్ని విషయాలు, పూర్తి నోటిఫికేషన్ కోసం సంబంధిత సీడీపీఓ/జిల్లా మహిళా శిశు అభివృద్ధి సాధికారత అధికారిణి కర్నూలు కార్యాలయంలో సంప్రదించాలన్నారు. దరఖాస్తుతో పాటు జిరాక్స్ కాపీలను (సెల్ఫ్ అటెస్టేషన్ చేయవలెను) జతపరిచి సంబంధిత ఐసీడీఎస్ సీడీపీఓ కార్యాలయాల్లో ఈ నెల 9 నుంచి 17వ తేదీలోగా కార్యాలయ పనిదినాల్లో అందించాలన్నారు.

ఉల్లి కొనుగోళ్లకు మూడు ప్రత్యేక టీమ్‌లు

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో మార్క్‌ఫెడ్ ద్వారా ఉల్లి కొనుగోళ్లను పర్యవేక్షించేందుకు వివిధ జిల్లాల మార్కెటింగ్ శాఖ అధికారులతో మూడు ప్రత్యేక టీమ్‌లు ఏర్పాటయ్యాయి. ఈ మేరకు మార్కెటింగ్ శాఖ కమిషనర్ విజయ సునీత ఉత్తర్వులు జారీ చేశారు. ఉమ్మడి జిల్లాలోని అన్ని మార్కెట్ కమిటీల సెక్రటరీలు, వివిధ జిల్లాల సిబ్బందిని ఇందులో భాగస్వాములను చేశారు.

➡ పల్నాడు జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి కేవీఎస్ ఉపేంద్ర, ఈస్ట్‌గోదావరి జిల్లా అధికారి సునీల్ విజయ్ ఆధ్వర్యంలో హాస్పిటాలిటీ టీమ్ ఏర్పాటైంది. మరో 10 మంది అధికారులు సభ్యులుగా ఉంటారు.

➡ రైతులకు నగదు చెల్లింపుల ప్రక్రియను పర్యవేక్షించేందుకు మార్కెటింగ్ శాఖ డీడీఎం దివాకర్‌రావు, ఎన్‌టీఆర్ జిల్లా అధికారి రాజబాబు ఆధ్వర్యంలో ప్రత్యేక టీమ్ ఏర్పాటు చేశారు. ఇందులో మరో 8 మంది అధికారులు ఉంటారు.

➡ గుంటూరు జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి పి.సత్యనారాయణ చౌదరి నేతృత్వంలో మీడియా మేనేజ్‌మెంట్, రిపోర్ట్స్ కమిటీ ఏర్పాటైంది. ఇందులో మరో ముగ్గురు అధికారులు సభ్యులుగా ఉంటారు.

బస్తామే సవాల్!

- తీరని యూరియా సమస్య
- అవసరం 51 వేల టన్నులు
- వచ్చింది 25 వేల టన్నులు
- దారి మళ్లిన ఎరువు
- కొరత మరింత తీవ్రం
- ఇబ్బంది పడుతున్న రైతులు

యూరియా.. యూరియా.. యూరియా ..

ఏ రైతు నోట విన్నా ఇదే మాటే. కాని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మాత్రం యూరియా కొరతే లేదని చెబుతున్నారు. వైఎస్సార్‌సీపీ నేతలే ఆందోళన చేస్తున్నారని దుష్ప్రచారం చేస్తున్నారు. యూరియా కోసం రైతులు ప్రతి గ్రామంలో కిలోమీటర్ల మేర బారులుతీరి నిలబడాల్సి వస్తోంది. పైరు ఎదుగుదల సమయంలో అవసరమైన ఎరువును రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వకపోవడంతో అంతటా ఆందోళన నెలకొంది. యూరియా కోసం గ్రామగ్రామానా అన్నదాతలు టీడీపీ నేతలతో పోటీపడాల్సి వస్తోంది. పాలన వైఫల్యాన్ని చూపుతోంది.



ఫైసా'చికం

ఈ చిత్రం నందవరం మండల పరిధిలోని కనకవీడు గ్రామంలో సోమవారం కనిపించింది. యూరియా లోడ్ రావడంతో రైతు సేవా కేంద్రానికి రైతులు భారీగా వచ్చారు. అయితే అప్పటికే అక్కడ టీడీపీ నాయకులు కనిపించారు. ఎక్కువ ధర ఇచ్చిన వారికి, తమ అనుచరులకు దగ్గర ఉండి యూరియా పంపిణీ చేయించారు. సామాన్య రైతులకు ఎరువు అందలేదు. ఇప్పటి వరకు గ్రామానికి రెండు లోడ్లు యూరియా వచ్చిందని, అంతా టీడీపీ నాయకులే దండుకుపోతున్నారని రైతులు ఆరోపించారు.

కర్నూలు(అగ్రికల్చర్): ప్రకృతి వైపరీత్యాలతో ఈ ఏడాది సాగు విస్తీర్ణం తగ్గినా రాష్ట్ర ప్రభుత్వం రైతులకు యూరియా అందించడంలో విఫలమైంది. గతేడాది ఖరీఫ్ సీజన్‌లో ఇదే సమయానికి 3.62 లక్షల హెక్టార్లలో పంటలు సాగయ్యాయి. ప్రస్తుతం సాగు విస్తీర్ణం 3.46 లక్షల హెక్టార్లకే పరిమితం అయ్యింది. యూరియా కొరత ఏర్పడి రైతులు ఆందోళన కార్యక్రమాలు చేస్తున్నారు. అయితే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రంలో ఎక్కడా యూరియా కొరత లేదని అబద్ధాలు చెబుతున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

దారి మళ్లించి

ఏప్రిల్ నుంచి జూలై వరకు యూరియాకు అంతగా డిమాండ్ లేదు. జూలై నెల వరకు 16 వేల టన్నులు వచ్చింది. కాని రైతులకు అందనేలేదు. పీఏసీఎస్‌లు, డీసీఎంఎస్‌లకు మార్క్‌ఫెడ్ ద్వారా ఇచ్చిన యూరియా టీడీపీ నేతలు దారి మళ్లించారు. ఒకరికి ఇచ్చి ఈపాస్ మిషన్‌లలో బయోమెట్రిక్ మాత్రం మరొకరితో వేయించారు. ప్రయివేటు డీలర్లు కూడా బ్లాక్‌లో విక్రయించి రైతులు కాని వారితో బయోమెట్రిక్ వేయించారు. బయోమెట్రిక్ వేసిన వారిలో 80 శాతం మంది యూరియానే తీసుకోలేదు. టీడీపీ నేతలు యూరియాను దారి మళ్లించడంతో కొరత ఏర్పడింది.

డిమాండ్ ఎక్కువ... సరఫరా తక్కువ

ఖరీఫ్ సీజన్ సెప్టెంబరు వరకు ఉంటుంది. ఖరీఫ్ సీజన్‌కు యూరియా 51 వేల టన్నులు అవసరం.. ఇందులో ఈ పాటికి కనీసం 40 వేలకుపైగా టన్నులు రావాల్సి ఉంది. అయితే ఇప్పటి వరకు జిల్లాకు వచ్చిన యూరియా కేవలం 25,505 టన్నులు మాత్రమే! ఖరీఫ్ సీజన్ మరో 24 రోజుల్లో ముగుయనున్నప్పటికీ 50 శాతం కూడ రాకపోవడం,. ఇందులో కూడా చాల వరకు టీడీపీ నేతలు దారిమళ్లించడంతో రైతులకు అందని పరిస్థితి ఏర్పడింది. కౌతాళం, పెద్దకడుబూరు, ఆదోని, హొళగొంద, హాలహర్వి, మంత్రాలయం, ఎమ్మిగనూరు, కొసిగి, పత్తికొండ, మద్దికెర, తుగ్గలి మండలాల్లో నెల రోజులుగా యూరియా కోసం నిత్యం ఆందోళన చేస్తున్నారు. సినిమా టికెట్ల మాదిరిగా యూరియా టోకన్ల కోసం రైతులు పోరాటం చేస్తోంది.

ఇదీ అవసరం..

కర్నూలు జిల్లాలో 13 వేల హెక్టార్లలో వరి సాగు కానుంది. వరి నాట్లు వేసే సమయంలో యూరియా వేస్తే పచ్చగా ఏపుగా పెరుగుతుంది. పిలకలు ఎక్కువగా వస్తాయి. వరి సాగు చేస్తున్న ఆదోని, కౌతాళం, మంత్రాలయం, హాలహర్వి, హొళగుద, కర్నూలు, సి.బెళగల్, గూడూరు మండలాల్లో వరి నాట్లు చురుగ్గా జరుగుతున్నాయి. ఈ ప్రాంతాల్లోని సామాన్య రైతులకు బస్తా యూరియా లభించడం కష్టమైంది. బస్తా యూరియా ధర రూ.267 మాత్రమే.. అయితే కర్నూలు మండలంలోని వివిధ గ్రామాల రైతులు తెలంగాణ నుంచి బస్తా రూ.600 ధరతో తెచ్చుకుంటున్నారు.

ఇవీ అక్రమాలు

- విజిలెన్స్, పోలీసులు, రెవెన్యూ అధికారులు తనిఖీలు జరిపి 130 టన్నుల యూరియాను సీజ్ చేశారు. మరో 387 టన్నులపై స్టాప్ సేల్ ఇచ్చారు.
- కొంత మంది ప్రయివేటు డీలర్లు ఇతర జిల్లాల నుంచి రోడ్డు మార్గాన బ్లాక్‌లో యూరియా తెప్పించి అమ్మకాలు సాగిస్తున్నారు. ఇటీవల ఈ విషయం విజిలెన్స్ అధికారుల తనిఖీల్లో వెలుగు చూసింది. ఇందుకు సంబంధించి కోడుమూరు, ఎమ్మిగనూరు, మంత్రాలయం మండలాల్లో ఒక్కొక్క క్రిమినల్ నమోదు చేశారు. ఒక డీలరు లైసెన్స్ సస్పెండ్ చేశారు. నలుగురుకి షోకాజ్ నోటీసులు జారీ చేశారు.

ఖరీఫ్ సీజన్‌కు యూరియా రావాల్సింది... వచ్చింది

నెల	జిల్లాకు రావాల్సింది	వచ్చింది (టన్నుల్లో)
ఏప్రిల్	1,562	2,549
మే	3,871	821
జూన్	6,095	3,216
జూలై	13,419	10,070
ఆగష్టు	14,576	6,644
సెప్టెంబరు	11,477	2,203
మొత్తం	51,000	25,505

రైతులకు శాపంగా మారింది



మాకు తొమ్మిది ఎకరాల భూమి ఉంది. ఇందులో రెండు ఎకరాల్లో వరి, ఏడు ఎకరాల్లో జొన్న సాగు చేశాం. యూరియా వేస్తేనే పైరు బాగా పెరిగి దిగుబడి వస్తుంది. మాకు కనీసం 35 బస్తాలు అవసరం. పోరాటం చేస్తే కేవలం ఐదు బస్తాలు లభించింది. ఇది కూడా రేషన్ తరహాలో ఒక పాసు బుక్కుకు ఒక బస్తా ప్రకారం ఇచ్చారు. ప్రభుత్వం చొరవ తీసుకోకపోవడం రైతులకు శాపంగా మారింది. – క్రిష్ణమూర్తి, బాపురం, హాలహర్వి మండలం

బస్తా కూడా దొరకలేదు



యూరియా కోసం కొన్ని రోజులుగా ప్రయివేటు డీలర్లు, ఆర్‌బీకేల చుట్టూ తిరుగుతున్నా. బస్తా కూడా దొరకలేదు. మేం ప్రస్తుతం 4 ఎకరాల్లో వరి సాగు చేశాం. యూరియా అత్యవసరం అయింది. 20 రోజుల నుంచి ఎదురు చూస్తున్నాం. వస్తుంది అంటారు. పోతే లేదు అయిపోయిందని చెబుతున్నారు. యూరియా ఏమవుతుందో తెలియని పరిస్థితి ఏర్పడింది. గతంలో ఎప్పుడూ ఇలాంటి పరిస్థితి ఏర్పడలేదు. – శ్రీనివాసరెడ్డి, నునునుర్రాళ్ల, తుగ్గలి మండలం

రెట్టింపు ధరకు తెచ్చుకున్నాం



మాకు సొంత భూమి లేదు. తొమ్మిది ఎకరాలు కౌలుకు తీసుకున్నాం. 4 ఎకరాల్లో మొక్కజొన్న, ఐదు ఎకరాల్లో వరి సాగు చేశాం. స్థానికంగా యూరియా ఒక్క బస్తా కూడ లభించడం లేదు. తెలంగాణ నుంచి బస్తా రూ.600 ప్రకారం తెచ్చుకుంటున్నాం. బస్తా ధర రూ.266 మాత్రమే ఉండగా రెట్టింపు కంటే ఎక్కువ ధరకు తెచ్చుకుంటున్నాం. ప్రభుత్వం యూరియా సరఫరా చేస్తే సమస్య ఉండదు. – జె.మాదన్న, జి.సింగవరం, కర్నూలు మండలం

నేడు అన్నదాత పోరు

- జిల్లాలోని ఆర్డీఓ కార్యాలయాల ఎదుట నిరసన



కర్నూలు (టౌన్): 'అన్నదాత పోరు' పేరుతో జిల్లాలోని అన్ని ఆర్డీఓ కార్యాలయాల ఎదుట మంగళవారం నిరసన నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి రైతులకు న్యాయం చేసేందుకు ఈ నిరసన చేపడుతున్నట్లు పేర్కొన్నారు. పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, యూరియా కొరత తీర్చాలని, ఉల్లి రైతుల కష్టాలు తీర్చాలని, అన్నదాతల సమస్యలు పరిష్కారించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కర్నూలులోని చిల్డ్రన్స్ పార్కు సీఎస్ఐ చర్చి నుంచి కర్నూలు ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి వినతి పత్రం అందజేస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గాల సమన్వయకర్తలు, రాష్ట్ర కమిటీ సభ్యులు, పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులు, కమిటీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

రైతులకు అండగా వైఎస్సార్‌సీపీ పోరాటం

- ఆలూరు ఎమ్మెల్యే బుసినె విరూపాక్షి



ఆలూరు: రెక్కల కష్టంతో పది మందికి అన్నం పెట్టే అన్నదాతలను రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, రైతులకు అండగా ఉంటూ వైఎస్సార్‌సీపీ పోరాటం చేస్తోందని ఎమ్మెల్యే బుసినె విరూపాక్షి అన్నారు. పత్తికొండ ఆర్డీఓ కార్యాలయం ఎదుట మంగళవారం 'అన్నదాత పోరు' పేరుతో నిరసన చేపట్టనున్నామన్నారు. ఆలూరులో సోమవారం ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడారు. యూరియా దొరకక, పంటలకు గిట్టుబాటు లేక రైతులు ఇబ్బంది పడుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మెడలు వంచి రైతుల సమస్యలు తొలగించేందుకే నిరసన చేపట్టనున్నట్లు తెలిపారు. రైతులు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర, జిల్లా, వివిధ మండలాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున తరలిరావాలన్నారు. పత్తికొండ ఆర్అండ్‌బి అతిథి గృహం సమీపంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలతో నివాళ్లు అర్పించిన అనంతరం 'అన్నదాత పోరు' ర్యాలీ ప్రారంభమవుతుందన్నారు.

రైతులపై కేసులా.. సిగ్గుచేటు!

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి

కర్నూలు (టౌన్): ఉల్లికి గిట్టుబాటు ధరలేక ఇద్దరు రైతులు ఆత్మహత్యాయత్నానికి పాల్పడి, ప్రాణాలతో పోరాడి, ఆసుపత్రిలో చికిత్స పొందారని, అలాంటి వారిపై రాష్ట్ర ప్రభుత్వం కేసులు నమోదు చేయడం సిగ్గుచేటని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి అన్నారు. కూటమి ప్రభుత్వానికి పోయేకాలం దగ్గరకు వచ్చిందని విమర్శించారు. సోమవారం ఆయన తన చాంబర్‌లో విలేకరులతో మాట్లాడుతూ.. రెండు నెలలుగా రైతులు ఆందోళనలు చేస్తున్నారన్నారు. ఇటీవల ఉల్లి రైతులు గిట్టుబాటు ధరలేక ఆందోళనలు చేశారన్నారు. ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటం వల్లే రైతులు రోడ్డెక్కారన్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్ నవ్య.. రైతుల వద్దకు వచ్చి మాట్లాడింది నిజం కాదా అన్నారు. ఉల్లి రైతులకు పూర్తి స్థాయిలో మద్దతు ధర కల్పించాం అని అధికారులు ఒక ప్రకటన విడుదల చేయగలరా.. అని ప్రశ్నించారు. ప్రభుత్వానికి వత్తాసు పలికే పత్రికల్లోనూ ఉల్లి రైతుల కష్టాలు అంటూ వార్తలు వచ్చాయి కదా అని ప్రశ్నించారు. రైతులను మోసం చేయడమే కాకుండా వారిపై కేసులు మోపడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఉల్లి ఘాటుకు ఢిల్లీలో ప్రభుత్వం కుప్పకూలిన విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం గుర్తించుకోవాలన్నారు. కూటమి ప్రభుత్వానికి రైతుల ఉసురు తప్పదన్నారు. ఇప్పటి వరకు రెడ్‌బుక్ రాజ్యాంగంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపైనే అక్రమ కేసులు పెట్టారని, తాజాగా రైతులను చేర్చడం దారుణమన్నారు. ఇందిరాగాంధీ హయాంలో ఎమర్జెన్సీ సమయంలో కూడా ఇలాంటి పరిస్థితులు లేవని, చంద్రబాబు సర్కార్ నియంతలా వ్యవహరిస్తుందని విమర్శించారు. రాబోయే రోజుల్లో ఈ ప్రభుత్వానికి ప్రజలు, రైతులే బుద్ధి చెబుతారన్నారు.

ముస్లింలకు బాబు మోసం



ధర్నా చేస్తున్న ముస్లిం నేతలు

కర్నూలు(సెంట్రల్):ముస్లింలకు న్యాయం చేస్తానని చెప్పి అధికారంలోకి వచ్చి సీఎం చంద్రబాబు మోసం చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు అహ్మద్ అలీఖాన్, మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు టీఎండీ ఫిరోజ్ ఆరోపించారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఇమామ్‌లు, మౌజమ్‌లకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని కోరుతూ ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. వైఎస్ జగన్ సీఎంగా ఉన్న సమయంలో ఇమామ్‌లకు రూ.10 వేలు, మౌజమ్‌లకు రూ.5 వేలు గౌరవ వేతనం ఇచ్చేవారన్నారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చాక పట్టించుకోవడం లేదన్నారు. 11 నెలల నుంచి గౌరవ వేతనాలు అందక ఇమామ్‌లు, మౌజమ్‌లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు.

ప్రభుత్వ శాఖల సమన్వయంతో పిల్లల సంరక్షణ



మాట్లాడుతున్న జిల్లా జడ్జి కబర్థి

కర్నూలు: ప్రభుత్వ శాఖల సమన్వయంతో పిల్లల సంరక్షణ చేపట్టాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.కబర్థి సూచించారు. ఆంధ్రప్రదేశ్ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆదేశాల మేరకు బాలుర సంరక్షణ, చట్టాల అమలుపై జిల్లా స్థాయి అధికారులతో సోమవారం న్యాయ సేవా సదన్ నందు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి కబర్థి, న్యాయ సేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి లీలా వెంకటశేషాద్రి కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ బాలల రక్షణ కేసులు నిర్వహించే పోలీసు సిబ్బందికి ప్రత్యేక శిక్షణ అవసరమన్నారు. పోలీసులు, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ, హెల్త్, రెవెన్యూ శాఖలు సమన్వయం చేసుకుని పిల్లలకు సంబంధించిన కేసులను త్వరగా పరిష్కారమయ్యేలా కృషి చేయాలని కోరారు. ఫోక్సో కోర్టు జడ్జి రాజేంద్ర బాబు మాట్లాడుతూ పిల్లలపై లైంగిక వేధింపుల కేసులను త్వరగా పరిష్కరించాల్సిన అవసరముందని, వారు ద్వితీయ బాధితులుగా మారకుండా చూడాలన్నారు. లీలా వెంకటశేషాద్రి మాట్లాడుతూ పిల్లల ప్రయోజనాల కోసం అన్ని పోలీస్ స్టేషన్లలో ప్రత్యేక చైల్డ్ హెల్ప్ డెస్కులను ఏర్పాటు చేయాలని సూచించారు. జ్యువైనల్ జస్టిస్ బోర్డు జడ్జి అనిల్ కుమార్ మాట్లాడుతూ పిల్లల వయస్సు నిర్ధారణలో జాప్యం లేకుండా చేస్తే కేసులను త్వరగా పరిష్కరించవచ్చన్నారు. జిల్లా రెవెన్యూ అధికారిణి వెంకటనారాయణమ్మ, సోషల్ వెల్ఫేర్ డీడీ రాధిక, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ జుబేదా బేగం, ప్రభుత్వ అబ్జర్వేషన్ హోం సూపరింటెండెంట్ హుసేన్ బాషా, జిల్లా ఇమ్యునైజేషన్ ఆఫీసర్ నాగప్రసాద్, నంద్యాల అడిషనల్ డీఎంహెచ్ఓ శారదా బాయి, కర్నూలు, నంద్యాల జిల్లాల చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్స్ శారద, స్వప్న తదితరులు పాల్గొన్నారు.



శోభాయమానంగా సీమోల్లంఘన

- ముగిసిన పీఠాధిపతి చాతుర్మాస దీక్ష
- కనులపండువగా స్వామిజీ ఊరేగింపు



భక్తజన సందోహం

మంత్రాలయం: ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల చాతుర్మాస దీక్ష ఆదివారం ముగిసింది. చాతుర్మాస దీక్ష విరమణలో భాగంగా సోమవారం సీమోల్లంఘన వేడుక చేపట్టారు. ఉదయం స్వామిజీ పవిత్ర తుంగభద్ర నదిలో దండక స్నానం ఆచరించి శాంతి, మృత్యుంజయ హోమాల్లో పూర్ణాహుతి గావించారు. సాయంత్రం సీమోల్లంఘన కార్యక్రమంలో భాగంగా పీఠాధిపతి వేలాది మంది భక్తజనుల మధ్య గ్రామ ప్రవేశం కానిచ్చారు. ముందుగా కొండాపురం ఆంజనేయస్వామి ఆలయం చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడి నుంచి ప్రత్యేక వాహనంపై కొలువుదీరగా భక్తజనులు జయజయధ్వానాలు పలికారు. మేళతాళాలు, కోలాటాలు, వేద మంత్రోచ్చారణలు, బాణా సందా పేలుళ్లతో అడుగడుగునా భక్తజన సందోహం నీరాజనం పలికింది. రాఘవేంద్ర సర్కిల్ మీదుగా మధ్వకారిడార్ నుంచి స్వామిజీ ఊరేగింపు శ్రీమఠం చేరుకుంది. ఎంతో శోభాయమానంగా సాగిన ఊరేగింపు భక్తజన వాహినిని ఆకట్టుకుంది. వేడుకలో పండిత కేసరి గిరియాచార్, ఏఏవో మాధవశెట్టి, మేనేజర్ శ్రీనివాస రావు, టీటీడీ పాలక మండలి మాజీ సభ్యుడు వై.సీతా రామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ భీమారెడ్డి, సర్పంచు తెల్లబండ్ల భీమయ్య, ఉప సర్పంచ్ హోటల్ పరమేష్, జోనల్ మేనేజర్ శ్రీపతిఆచార్ తదితరులు పాల్గొన్నారు.

టీచర్ పోస్టుల్లో 'అనర్హత' మలుపు!

- ఉమ్మడి జిల్లాలో 155 మంది అనర్హులు!
- 65 పోస్టులకు అర్హులైన అభ్యర్థులు లేరు
- డీఈఓలకు అందిన తుది సెలక్షన్ జాబితా
- అభ్యంతరాలకు రెండు రోజులు గడువు ఇచ్చే అవకాశం
- అనంతరం సెలక్షన్ ఉత్తర్వుల జారీ

కర్నూలు సిటీ: ఉపాధ్యాయ ఉద్యోగాలు ఇచ్చే ప్రక్రియలో మరో మలుపు తెరపైకి వచ్చింది. డీఎస్సీ పరీక్షలు నిర్వహించి, కాల్ లెటర్లు పంపించి, సర్టిఫికెట్లను రెండు కమిటీలు పరిశీలించి తుదికి ఒక విషయాన్ని అధికారులు తేల్చారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 155 మంది ఉపాధ్యాయ పోస్టులకు అనర్హులు అని తేల్చారు. ఇందుకు పలు కారణాలు చెప్పారు. అమరావతిలో పాఠశాల విద్యాశాఖ కమిషనర్ దగ్గర సోమవారం డీఈఓల సమావేశం జరిగింది. డీఎస్సీ తుది సెలక్షన్ జాబితాను డీఈఓ కు అందజేసినట్లు తెలిసింది. తుది జాబితాపై అభ్యంతరాలకు రెండు రోజులు గడువు ఇచ్చి అనంతరం సెలక్షన్ ఉత్తర్వులను జారీ చేసే అవకాశం ఉంది.

'వెరి'ఫికేషన్!

ఉమ్మడి కర్నూలు జిల్లాలో పాఠశాల విద్యలో మొత్తం 2,645 పోస్టులు, ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమ పాఠశాలలో 33 పోస్టులు మెగా డీఎస్సీ ద్వారా భర్తీ చేస్తున్నారు. ఈ పోస్టులకు 39,970 మంది అభ్యర్థులు 73,605 దరఖాస్తు చేసుకున్నారు. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం 9 నెలలకు మెగా పేరుతో డీఎస్సీ అంటూ కనీసం 90 రోజుల సమయం లేకుండానే నెల రోజుల పాటు ఆన్‌లైన్‌లో పరీక్షలు నిర్వహించింది. తుది సెలక్షన్, కటాఫ్ మార్కుల జాబితాలు లేకుండానే గత నెల 28, 29 తేదీల్లో 2,525 మందికి కాల్ లెటర్లు ఇచ్చారు. ఇందులో 2,509 మంది సర్టిఫికెట్లను పరిశీలించారు. మిగిలిన 12 మంది సర్టిఫికెట్లను గత నెల 30వ తేదీన పరిశీలించగా 8 మంది ఉద్యోగం తమకు వద్దు అని అంగీకారం తెలిపారు. ఆ తరువాత 76 మందికి ఒకరోజు, 33 మందికి మరో రోజు కాల్ లెటర్లు పంపించి సర్టిఫికెట్లను పరిశీలించారు. సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి అయిన మరో కమిటీ వేసి రీ వెరిఫై చేయించారు. ఇందులో ఎంత మంది అర్హులు అయ్యారు, ఎంత మంది అనర్హులు అయ్యారు అనే విషయంపై సోమవారం అమరావతిలో పాఠశాల విద్యాశాఖ కమిషనర్ దగ్గర జరిగిన డీఈఓల సమావేశంలో తేలింది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 155 మంది అనర్హులుగా తేలినట్లు సమాచారం. దీంతో పాటు 65 పోస్టులకు అర్హులైన అభ్యర్థులు లేనట్లు నిర్ధారించారు. తుది సెలక్షన్, కటాఫ్ జాబితాలు డీఈఓకు అందజేయనున్నట్లు తెలుస్తోంది. ఈ జాబితాలు వచ్చిన తరువాత రెండు రోజులు అభ్యంతరాలను స్వీకరించనున్నారు. ఆ తరువాత సెలక్షన్ ఆర్డర్లు ఇవ్వనున్నారు.

ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు షాక్!

ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ ద్వారా డీఎస్సీలో కాల్ లెటర్లు వచ్చి సర్టిఫికెట్లు వెరిఫై చేయించుకున్న మహిళలకు షాక్ తగిలింది. ఈ మహిళలు.. తండ్రి పేరుతో ఉన్న ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్లు తీసుకున్నారు. అయితే వివాహం అయిన మహిళలకు కుటుంబం మారిపోయింది. భర్త పేరుతో ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్ తీసుకొని వెరిఫికేషన్ టీఎంకు అందజేయాలని విద్యాశాఖ అభ్యర్థులకు సూచించినట్లు తెలుస్తోంది.

అంతా సందిగ్ధం

కాల్ లెటర్లు వచ్చి సర్టిఫికెట్ల పరిశీలన పూర్తయినా ఉద్యోగం వస్తుందో, రాదో తెలియక గత రెండు వారాలుగా డీఎస్సీ అభ్యర్థులు ఆశ.. నిరాశల మధ్య ఊగిసలాడుతున్నారు. దేశంలో ఎక్కడా లేని నిబంధనలను అమలు చేస్తుండటంతో అయోమయంలో ఉన్నారు. రాష్ట్ర ప్రభుత్వ చర్యలతో విద్యాశాఖ అధికారులు సైతం తలలు పట్టుకుంటున్నారు. డీఎస్సీ అంటే డిస్ట్రిక్ సెలక్షన్ కమిటీ.. అయితే జిల్లా కలెక్టర్ చైర్మన్‌గా జరగాల్సిన సెలక్షన్‌ను పాఠశాల విద్యాశాఖ కమిషనర్ వద్దకు తీసుకెళ్లారు.

క్లుప్తంగా

మహానందిలో శాస్త్రోక్తంగా సంప్రోక్షణ పూజలు



ఆలయంలో సంప్రోక్షణ పూజలు నిర్వహిస్తున్న వేదపండితులు, అర్చకులు

మహానంది: రాహుగ్రస్త సంపూర్ణ చంద్రగ్రహణం అనంతరం మహానందిలో సోమవారం ఉదయం సంప్రోక్షణ పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ వేద పండితులు బ్రహ్మశ్రీ చందూరి రవిశంకర అవధాని, ఉప ప్రధాన అర్చకులు మూలస్థానం శివశంకర శర్మ, అర్చకులు ప్రత్యేక పూజలు జరిపారు. తెల్లవారు జామున 4 గంటలకు ఆలయ తలుపులు తెరిచి గణపతి పూజ, పుణ్యాహవాచనం, సంప్రోక్షణ ఆలయ శుద్ధి పూజలు చేశారు. అనంతరం ఉదయం 6.30 గంటల నుంచి భక్తులకు యథావిధిగా శ్రీ కామేశ్వరీ దేవి సహిత మహానందీశ్వరస్వామి దర్శనం కల్పించారు. కార్యక్రమంలో ఆలయ సూపరిటెండెంట్ అంబటి శశిధర్‌రెడ్డి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ నాగమల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

స్త్రీ, శిశు సంక్షేమంలో కాంట్రాక్టు పద్ధతిన పోస్టుల భర్తీ

కర్నూలు(అర్బన్): మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని శిశు గృహ, బాలసదన్ల లో ఖాళీగా ఉన్న పోస్టులను కాంట్రాక్టు, పార్ట్‌టైం పద్ధతిన భర్తీ చేయనున్నట్లు ఐసీడీసీ పీడీ పి.విజయ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

● జిల్లా కేంద్రంలోని శిశు గృహలో సోషల్ వర్కర్ కమ్ ఎర్లీచైల్డ్ హుడ్ ఎడ్యుకేటర్, రెండు ఆయా పోస్టులు (ఈడబ్ల్యూఎస్ -1, ఓసీ మహిళ) ఖాళీగా ఉన్నాయన్నారు.

● పత్తికొండ బాల సదనంలో అవుట్ సోర్సింగ్ పద్ధతిన కుక్ -1 (ఎస్సీ మహిళ), హెల్పర్ కమ్ నైట్ వాచ్‌మెన్ (ఎస్సీ మహిళ), పార్ట్‌టైం పద్ధతిన ఎడ్యుకేటర్ - 1 (ఓసీ మహిళ), ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ కమ్ మ్యూజిక్ టీచర్ (ఎస్సీ మహిళ), ఇన్స్‌స్ట్రక్టర్ కమ్ యోగా టీచర్ - 1 (ఓసీ మహిళ) పోస్టులు ఉన్నాయన్నారు.

● పెద్దపాడు బాల సదనంలో ఇన్‌స్ట్రక్టర్ కమ్ యోగా టీచర్ -1 (ఎస్సీ మహిళ) పోస్టును పార్ట్‌టైం పద్ధతిన భర్తీ చేస్తామన్నారు.

● ఆయా పోస్టులకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, వికలాంగులైన అభ్యర్థులకు ఐదేళ్ల వయస్సు సడలింపు ఉంటుందన్నారు. అభ్యర్థులు ఈ నెల 9 నుంచి 17వ తేదిలోగా (కార్యాలయ పనిదినాల్లో మాత్రమే) ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు కలెక్టరేట్‌లోని స్త్రీ శిశు సంక్షేమ శాఖ కార్యాలయం రూమ్ నెంబర్.122లో దరఖాస్తులను అందజేయాలన్నారు. విద్యార్హతలు, ఇతర వివరాల కోసం వెబ్‌సైట్ : htt p://k ur noo .a p.g-o-v.i nlZ, కార్యాలయ నోటీసు బోర్డులో పరిశీలించాలని ఆమె పేర్కొన్నారు.

సైబర్ నేరగాళ్లు నగదు కాజేశారు!

● ఎస్పీకి ఫిర్యాదు చేసిన బాధితుడు
● పీజీఆర్ఎస్‌కు 98 ఫిర్యాదులు

కర్నూలు: పీఎం కిసాన్ పేరుతో తన మొబైల్‌కు ఏపీకే ఫైల్ పంపి రెండు బ్యాంకు ఖాతాల నుంచి రూ.65 వేలు సైబర్ నేరగాళ్లు కాజేశారని, విచారణ జరిపి పోయిన డబ్బును రికవరీ చేసి ఇవ్వాలని కల్లూరుకు చెందిన సూర్యనారాయణ ఎస్పీ విక్రాంత్ పాటిల్‌కు ఫిర్యాదు చేశారు. కర్నూలు రెండో పట్టణ పోలీస్‌స్టేషన్ పక్కనున్న క్యాంప్ కార్యాలయంలో సోమవారం ఎస్పీ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతులను స్వీకరించి వారితో నేరుగా మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పీజీఆర్ఎస్‌కు మొత్తం 98 ఫిర్యాదులు వచ్చాయి. వాటిపై



ఎస్పీ విక్రాంత్ పాటిల్‌కు ఫిర్యాదు చేస్తున్న ప్రజలు

చట్ట పరిధిలో విచారణ జరిపి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఎస్పీ హామీ ఇచ్చారు. కర్నూలు డీఎస్పీ బాబు ప్రసాద్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుంచి వినతులను స్వీకరించారు.

పీజీఆర్ఎస్‌కు వచ్చిన ఫిర్యాదుల్లో కొన్ని...

☛ ఆర్మీలో పనిచేస్తున్న కుమారుడి దగ్గరికి వెళ్లిన సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఐదు నెలలుగా ఖాళీగా ఉన్న తన ఇంట్లో చేరి ఖాళీ చేయకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి లక్ష్మీనగర్‌కు చెందిన జయరామిరెడ్డి ఫిర్యాదు చేశారు.

☛ తన పొలానికి రస్తా ఇవ్వకుండా కురువ నరసింహులు అనే వ్యక్తి ఇబ్బందులకు గురిచేస్తున్నాడని గోనెగండ్ల మండలం హెచ్.కైరవాడి గ్రామానికి చెందిన భాస్కర్ రెడ్డి ఫిర్యాదు చేశారు.

☛ కోడుమూరు రోడ్డులో ఉన్న 18 సెంట్ల స్థలాన్ని మురళీమోహన్, కాంట్రాక్టర్ జాన్ కలసి కబ్జా చేశారని, విచారణ జరిపి వారిపై చర్యలు తీసుకోవాల్సిందిగా కర్నూలు షరాఫ్ బజార్‌కు చెందిన వెంకటనారాయణ ఫిర్యాదు చేశారు.

☛ అనంతపురం పట్టణానికి చెందిన జయచంద్ర బెంగళూరులో ప్రైవేటు ఉద్యోగం చేస్తూ తనకు కూడా ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి రూ.లక్ష తీసుకుని మోసం చేశాడని ఒక వ్యక్తి ఫిర్యాదు చేశారు.

కూటమి నేతల బరితెగింపు

● కేరళ వ్యాపారి వస్త్ర దుకాణం ఏర్పాటు
● ఎమ్మెల్యేను ఆశ్రయించి అడ్డుకున్న స్థానిక వ్యాపారులు
● ట్రేడింగ్ లైసెన్స్ ఇవ్వకుండా అధికారులపై ఎమ్మెల్యే ఒత్తిడి
● దుకాణం ప్రారంభించకుండానే మూతేసిన వైనం



ప్రారంభించకుండానే మూతపడిన కేరళ వస్త్ర దుకాణం

డోన్: 'మా ఊర్లో మీరు బతకడానికి వీలులేదు.. మీరు వ్యాపారాలు ప్రారంభిస్తే మా వ్యాపారాలు దెబ్బతింటాయి.. అనే జాడ్యం డోన్‌కు వ్యాపించింది. ఇందులో భాగంగా అధికార పార్టీకి చెందిన వస్త్ర దుకాణదారులు స్థానిక ప్రజాప్రతినిధి సహాయంతో కేరళ వ్యాపారికి ట్రేడింగ్ లైసెన్స్ ఇవ్వకుండా అడ్డుకున్న ఘటన వెలుగు చూసింది. గార్మెంట్స్ వ్యాపారులు చాలా ఏళ్ల నుంచి ఇక్కడ సిండికేట్‌గా ఏర్పడి ఇతరులు ఎవరూ ఈ రంగంలోకి రాకుండా అడ్డుకుంటున్నారు. ఫుట్‌పాత్‌పై రెడిమేడ్ దుస్తులను విక్రయించడాన్ని కూడా అడ్డుకొని దాడులు చేయించిన ఘటనలు ఉన్నాయి. ఈ క్రమంలో కేరళ ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి స్థానిక బుగ్గన శేషారెడ్డి మార్గ్‌లో ఓ దుకాణం అద్దెకు తీసుకొని వస్త్ర దుకాణం ఏర్పాటు చేయాలనుకున్నాడు. సుమారు 20 లక్షల దుస్తులతో పాటు, రూ.5 లక్షలు వెచ్చించి దుకాణాన్ని ఫర్నిచర్‌తో సరికొత్తగా తీర్చిదిద్దాడు. అయితే వీరి రాకతో గార్మెంట్స్ వ్యాపారం దెబ్బతినే ప్రమాదం ఉందని ముందే పసిగట్టిన అధికార పార్టీకి చెందిన వ్యాపారులు ఇటీవల ఆ షాపుపై దాడిచేసి యజమానిని బెదిరించారు. అంతేకాకుండా పోలీసు, మున్సిపల్ అధికారులపై ఒత్తిడి తెచ్చి షాపు తెరవకుండా అడ్డుకున్నారు. స్థానిక ప్రజాప్రతినిధి చెప్పారంటూ మున్సిపల్ అధికారులు ఆ షాపునకు ట్రేడింగ్ లైసెన్స్ ఇవ్వడానికి నిరాకరించారు. ట్రేడింగ్ లైసెన్స్ ఉంటే షాపు తెరుచుకో.. లేదంటే లేదని పోలీసులు కూడా అధికార పార్టీ నేతలకు వంత పాడారు. దీంతో కేరళ వ్యాపారి దిక్కుతోచని స్థితిలో షాపును మరో ఊరికి మార్చేందుకు నిర్ణయించుకున్నారు. తెచ్చిన సరుకును తరలించేందుకు మూట గట్టారు. స్థానిక ఓ ప్రజా ప్రతినిధి చెబితేనే ట్రేడింగ్ లైసెన్స్ ఇవ్వలేదని మున్సిపల్ కమిషనర్ బాహాటంగా చెబుతుండటం గమనార్హం.

టీడీపీ నేత చెబితే వినాల్సిందే

● కత్తితో బెదిరించి మేకను తీసుకెళ్లిన వ్యక్తి
● పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితుడు
● టీడీపీ నేత ఒత్తిళ్లతో కేసు నమోదుకు పోలీసుల తాత్సారం

బేతంచెర్ల: పట్టణంలోని సంజీవనగర్ కాలనీలో టీడీపీ సానుభూతి పరుడు ఎరుకలి సుంకన్న అలియాస్ (సింహాద్రి) ఆదివారం రాత్రి వీరంగం సృష్టించాడు. కాలనీకి చెందిన నల్లబోతుల వెంకటేశ్వర్లు మేకలు మేపుతూ జీవనం కొనసాగిస్తున్నాడు. అదే కాలనీకి చెందిన ఎరుకలి సుంకన్న ఏడాది క్రితం రూ. 4 వేలు డబ్బులు ఇచ్చి నల్ల బోతుల వెంకటేశ్వర్లు వద్ద రెండు మేక పిల్లలను కొనుగోలు చేసి తననే పెంచాలని అక్కడే వదిలేశాడు. కొన్నాళ్లకు అనారోగ్యంతో ఆ రెండు మేక పిల్లలు చనిపోయాయి. ఈ విషయంలో సుంకన్న తరచూ గొడవ పెట్టుకోవడంతో మేకలకు పిల్లలు పుడితే ఇస్తానని వెంకటేశ్వర్లు చెబుతుండేవాడు. ఈ క్రమంలో ఆదివారం అర్ధరాత్రి సమయంలో సుంకన్న మరో ఇద్దరిని వెంట బెట్టుకొని మేకల దొడ్డి దగ్గర నిద్రిస్తున్న వెంకటేశ్వర్లు, అతని భార్య మద్దమ్మతో



ఎరుకలి సుంకన్న తన ఇంటి ముంగిట కట్టివేసిన మేక పోతు

కత్తితో బెదిరించి ఓ మేక పోతును వెంట పట్టుకెళ్లాడు. న్యాయం కోసం బాధితులు సోమవారం ఉదయం పోలీసులను ఆశ్రయించారు. అయితే ఎరుకలి సుంకన్నకు టీడీపీ మండల నాయకుడి మద్దతు ఉండటంతో అతనిపై కేసు నమోదు చేయకుండా పోలీసులు జాప్యం చేస్తున్నారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు దౌర్జన్యాలకు పాల్పడుతున్నా పోలీసులు సైతం అడ్డుకోలేక పోతుండటంతో సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

హత్యాయత్నం కేసులో నిందితుడికి ఏడేళ్లు జైలు

శిరివెళ్ల: కోటపాడుకు చెందిన రాగిపోగుల నారాయణకు హత్యాయత్నం కేసులో ఏడేళ్ల జైలు శిక్ష పడినట్లు ఎస్ఐ చిన్న పీరయ్య సోమవారం తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు.. 2019 జూలై 21వ తేదీన పాత కక్షలను మనస్సులో పెట్టుకొని జాంబుల నడిపి ఓబులేసు అతని స్నేహితులతో గ్రామంలోని లింగమయ్య అరుగు వద్ద కాలక్షేమం కోసం మాట్లాడుకుంటున్నారు. ఆ సమయంలో నారాయణ పాత కక్షలను మనస్సులో పెట్టుకుని ఓబులేసు వీపుపై, చేతిపై కత్తితో పొడవడానికి ప్రయత్నించాడు. తప్పించుకునే ప్రయత్నంలో ఓబులేసు ఎడమ చేతికి గాయమైంది. అప్పట్లో బాధితుడి ఫిర్యాదు మేరకు హత్నాయత్నం కేసు నమోదు చేశారు. ఆళ్లగడ్డ కోర్టులో జరిగిన పలు దఫాల విచారణలో సాక్షుల విచారణ మేరకు నిందితుడికి ఏడేళ్ల జైలు శిక్ష, రూ.5 వేల జరిమానా విధిస్తూ జడ్జి తీర్పు ఇచ్చారని ఎస్ఐ తెలిపారు.

15 నుంచి గాలికుంటు టీకాలు

జూపాడుబంగ్లా: ఈనెల 15 నుంచి పశువులకు గాలికుంటు టీకాలు వేయనున్నట్లు పశుసంవర్ధకశాఖ అసిస్టెంటు డైరెక్టర్ రామాంజినేయనాయక్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. పశువులకు, జీవాలకు గాలికుంటు వ్యాధి వ్యాపించకుండా ముందుజాగ్రత్తగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేస్తున్నట్లు తెలిపారు. పశుగ్రాసం పెంచుకోవటానికి గాను రాయితీపై పశుగ్రాసం విత్తనాలు రైతు సేవా కేంద్రాలు, పశువైద్యశాలలో అందజేస్తున్నట్లు వివరించారు. సీఎస్‌హెచ్-24రకం పశుగ్రాసం ఐదుకిలోల విత్తనాల ప్యాకెట్ పూర్తి ధర రూ.460 కాగా రాయితీ రూ. 345 కాగా రైతులు కేవలం రూ.115 చెల్లించి విత్తనాలు పొందవచ్చునన్నారు. ఆఫ్రికల్‌టాల్ జొన్నరకం ఐదు కిలోల విత్తనాల ధర రూ.340 కాగా రాయితీ రూ.255 పోను రైతులు కేవలం రూ.85 చెల్లించి పొందవచ్చునన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

అనధికార నివాసాలపై మూకుమ్మడి దాడి

● ఏబీసీ క్యాంపుల్లో 127 గృహాలకు విద్యుత్, నీటి సరఫరా కట్




అనధికార నివాసాలను పరిశీలిస్తున్న అధికారులు, విద్యుత్ సరఫరా నిలిపేస్తున్న దృశ్యం

కర్నూలు(అర్బన్): నగరంలోని ఏ, బీ, సీ క్యాంపుల్లోని క్వార్టర్లలో అనధికారికంగా నివాసాలు ఉన్న వారిని ఖాళీ చేయించేందుకు సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది మూకుమ్మడిగా దాడులు నిర్వహించారు. ప్రధానంగా రెవెన్యూ, మున్సిపల్, ఆర్అండ్‌బీ, ఏపీఎస్‌పీడీసీఎల్, పోలీస్ శాఖలకు చెందిన అధికారులు ఈ దాడుల్లో పాల్గొన్నారు. మూడు క్యాంపుల్లో మొత్తం 953 క్వార్టర్లు ఉండగా, వీటిలో అధికారికంగా 367 మంది నివాసం ఉంటున్నారు. అలాగే 96 క్వార్టర్లు శిథిలావస్థకు చేరగా, మిగిలిన 490 క్వార్టర్లలో అనధికారికంగా నివాసాలు ఉంటున్నారు. అనధికారికంగా నివాసాలు ఉంటున్న వారందరూ ఖాళీ చేయాలని ఇప్పటికే పలుమార్లు నోటీసులు కూడా ఇచ్చామని, చివరి అవకాశంగా ఈ నెల 7వ తేది వరకు గడువు ఇచ్చినట్లు సంబంధిత శాఖల అధికారులు చెబుతున్నారు. అయితే అనధికారికంగా నివాసాల్లో ఉన్న వారి నుంచి ఎలాంటి స్పందన రాకపోవడంతో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఆయా నివాసాలకు విద్యుత్, నీటి సరఫరాను నిలిపివేసినట్లు చెప్పారు. మూడు క్యాంపులకు మూడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి 127 గృహాలకు విద్యుత్, నీటి సరఫరాను నిలిపి వేయించినట్లు ఆర్అండ్‌బీ కర్నూలు ఈఈ సీవీ సునీల్‌రెడ్డి తెలిపారు. ఈ దాడులను ఆర్అండ్‌బీ ఎస్ఈ మహేశ్వరరెడ్డి, కర్నూలు ఆర్డీఓ సందీప్‌కుమార్‌తో పాటు ఆయా శాఖలకు చెందిన అధికారులు పర్యవేక్షించారు.

ప్రజల అర్జీలపై ప్రత్యేక దృష్టి

కర్నూలు(సెంట్రల్): ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చిన అర్జీలపై ప్రత్యేక దృష్టిసారించాలని అధికారులను జేసీ డాక్టర్ బి.నవ్య ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో సోమవారం ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ.. పీజీఆర్ఎస్‌లో వచ్చిన అర్జీలను నిర్ణీత గడువులోపు పరిష్కరించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. లాగిన్‌లో పరిష్కారం అయిన వాటిని ఎప్పటికప్పుడు ఆడిట్ చేయాలన్నారు. సీఎంఓ గ్రీవెన్స్‌లకు సంబంధించి ఆదోని సబ్ కలెక్టర్ దగ్గర 11, కర్నూలు ఆర్డీఓ దగ్గర 8, పత్తికొండ ఆర్డీఓ దగ్గర 4, కలెక్టరేట్ ఏఓ దగ్గర 3, సర్వే ఏడీ, విద్యాశాఖ, డీఆర్డీఏ పీడీ, ఏపీఐఐసీ జెడ్ఎంల దగ్గర ఒక్కో అర్జీ పెండింగ్‌లో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో డీఆర్వోసి.వెంకటనారాయణమ్మ, హౌసింగ్ పీడీ చిరంజీవి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అనురాధ పాల్గొన్నారు.

అర్జీల్లో కొన్ని..



ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తున్న జేసీ డాక్టర్ బి.నవ్య

● కర్నూలు మండలం పంచలింగాల సమీపాన ఉన్న స్కంద వెంచర్‌లో పార్కు కోసం కేటాయించిన 2 ఎకరాల స్థలాన్ని ఆక్రమణకు గురి కాకుండా కాపాడాలని అవాజ్ నగర కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు పి.ఇక్బాల్ హుస్సేన్, ఎస్ఎండీ షరీఫ్ జేసీ డాక్టర్ బి.నవ్యకు వినతిపత్రం ఇచ్చారు.

● తమకు ప్రత్యేకంగా రేషన్ కార్డు ఇవ్వాలని హిజ్రాలు అర్జీలు ఇచ్చారు.

● ప్రభుత్వ పాఠశాలల్లో ఆయాలుగా పనిచేస్తున్న వారికి మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న గౌరవ వేతనాలను వెంటనే చెల్లించాలని అర్జీ ఇచ్చారు.

108లో మహిళ ప్రసవం



పాణ్యం: కొండజుటూరు గ్రామానికి చెందిన అనిత గర్భిణి 108లో ఆసుపత్రికి తరలిస్తుండగా అందులోనే ఆడ శిశువుకు జన్మనించింది. సోమవారం మహిళకు తెల్లవారుజామున పురిటి నొప్పులు రావవడంతో 108కు సమాచారం అందించారు. పాణ్యం 108సిబ్బంది గ్రామానికి చేరుకొని నంద్యాల జీజీహెచ్‌కు గర్భిణిని తరలిస్తుండగా 108లోనే ఆడ బిడ్డను ప్రసవించినట్లు ఈఎంటీ తిమ్మయ్య, పైలెట్ చెన్నయ్య తెలిపారు. శిశువు, తల్లి ఆరోగ్యంగా ఉన్నారన్నారు. అనతరం వైద్య పరీక్షల కోసం నంద్యాల జీజీహెచ్‌కు తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు.

మనస్పర్థలతోనే స్వర్ణకారుడి హత్య

● వీడిన స్వర్ణకారుడి హత్య కేసు మిస్టరీ
● నిందితులను అరెస్టు చేసిన పోలీసులు
● వివరాలు వెల్లడించిన డీఎస్పీ



హత్య కేసులో నిందితులను అరెస్టు చూపుతున్న పోలీసులు

కర్నూలు: బంగారు నగల తయారీదారుడు షేక్ ఇజహర్ అహ్మద్ (45) హత్య కేసు మిస్టరీ వీడింది. రెండు కుటుంబాల మధ్య గొడవలు, మనస్పర్థలే హత్యకు కారణమని పోలీసులు దర్యాప్తులో తేలింది. నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. కర్నూలు ఒకటో పట్టణ సీఐ పార్థసారథి, పీసీఆర్ సీఐ శివశంకర్, ఎస్ఐ తిమ్మారెడ్డితో కలసి సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో కర్నూలు డీఎస్పీ బాబు ప్రసాద్ వివరాలు వెల్లడించారు.

కేసు ఛేదన ఇలా..

కర్నూలు కొత్తపేటలో షేక్ ఇజహర్ అహ్మద్ నివాసముంటున్నాడు. కొండారెడ్డిబురుజు వద్ద ఉన్న స్వర్ణలోక్ కాంప్లెక్స్‌లోని 29వ నంబర్ దుకాణంలో నగలు తయారు చేసేవాడు. రాధాకృష్ణ థియేటర్ సమీపంలోని మద్దియాన్ కీ మసీదుకు తండ్రి షేక్ గౌస్ నిసార్ అహ్మద్‌తో కలసి ఈనెల 1వ తేదీన నమాజు ముగించుకుని బయటకు వస్తుండగా గుర్తు తెలియని వ్యక్తులు కత్తులతో దాడి చేసి పరారయ్యారు. ప్రభుత్వాసుపత్రిలో చేర్పించి వైద్యచికిత్సలు చేయించగా అదే రోజు రాత్రి 8 గంటలకు కోలుకోలేక మృతిచెందాడు. తండ్రి షేక్ గౌస్ నిసార్ అహ్మద్ ఫిర్యాదు మేరకు కర్నూలు ఒకటో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. కేసు దర్యాప్తులో భాగంగా నిందితులు నగర శివారులోని జొహరాపురం పక్కి మసీదు వద్ద ఉన్నట్లు సమాచారం అందింది. కాపు కాసి కర్నూలు గనీగల్లీకి చెందిన షేక్ ఇమ్రాన్, మొగల్‌పుర వీధికి చెందిన ఎస్ఎండీ ఇర్ఫాజ్, ఖడక్‌పుర వీధికి చెందిన షేక్ జహీన్ అహ్మద్ అలియాస్ జహంగీర్‌లను అదుపులోకి తీసుకుని విచారించగా అసలు విషయం బయటపడింది. రెండు కుటుంబాల మధ్య గొడవలు, మనస్పర్థలే హత్యకు కారణమని పోలీసులు దర్యాప్తులో తేల్చారు. హత్య కేసులో మొత్తం ఐదుగురు నిందితులు కాగా, ఇమ్రాన్, యూసుఫ్‌లు పరారీలో ఉన్నట్లు డీఎస్పీ వెల్లడించారు. నేరానికి ఉపయోగించిన కత్తులు, స్కూటీని సీజ్ చేసి నిందితులను కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి రిమాండ్‌కు ఆదేశించినట్లు తెలిపారు. కేసును త్వరితగతిన ఛేదించి నిందితులను రిమాండ్‌కు పంపినందుకు దర్యాప్తు అధికారులను డీఎస్పీ అభినందించారు.

కాపర్ వైర్ల దొంగలు అరెస్ట్

సంజామల: రాంకో సిమెంట్ ఫ్యాక్టరీ రైల్వేలైన్‌కు సంబంధించిన విద్యుత్ రాగి (కాపర్) వైర్లు అపహరించిన దొంగలను ఎట్టకేలకు అరెస్ట్ చేశారు. ఎస్ఐ రమణయ్య సోమవారం తెలిపిన వివరాల మేరకు..రాంకో సిమెంట్ ఫ్యాక్టరీకు సంజామల నుంచి కొలిమిగుండ్ల మండలం వరకు నూతన రైల్వేట్రాక్ పనులు జరుగుతున్నాయి. రెడ్డిపల్లె గ్రామ సమీపంలో గత నెల 23వ తేదీన రైల్వే లైన్‌కు చెందిన దాదాపు రూ.5.50 లక్షల విలువైన రాగి విద్యుత్ వైర్లు దొంగలించారు. ఫ్యాక్టరీ ఎలక్ట్రికల్ మేనేజర్ కృష్ణమూర్తి ఫిర్యాదు మేరకు సంజామల పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. దర్యాప్తు చేపట్టిన ఎస్ఐ రమణయ్య సోమవారం ప్రకాశం జిల్లా గిద్దలూరుకు చెందిన నలుగురు వ్యక్తులను అదుపులోకి



దొంగల అరెస్ట్ చూపుతున్న ఎస్ఐ రమణయ్య

తీసుకుని విచారణ చేయగా.. రాగి విద్యుత్ వైర్లు దొంగలించినట్లు ఒప్పుకున్నారు. నిందితుల దగ్గర నుంచి రూ.4.40 లక్షల విలువైన 210 కేజీల వైర్లు స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ రమణయ్య తెలిపారు. సమావేశంలో హెడ్‌కానిస్టేబుల్ రాముడు, మహేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్‌కు దీటుగా..



విద్యార్థులకు ఐడెంటి కార్డులను పంపిణీ చేస్తున్న ప్రధానోపాధ్యాయుడు

ఉయ్యాలవాడ: ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో ప్రతి విద్యార్థికి ఐడీ కార్డులు అందజేస్తారు. ఆ తరహాలోనే తమ విద్యార్థులకు కూడా ఉండాలని మాయలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మహబూబ్ షరీఫ్ అనుకున్నారు. ఈ క్రమంలో తన సొంత నిధులు రూ. 9 వేలు వ్యయం చేసి పాఠశాలలోని 140 మంది విద్యార్థులకు ఐడెంటీ కార్డులను తయారు చేయించారు. సోమవారం వాటిని హెచ్ఎం విద్యార్థులకు అందజేశారు. విద్యార్థుల తల్లిదండ్రులు ప్రధానోపాధ్యాయుడికి కృతజ్ఞతలు తెలిపారు.

ఉల్లి కొనుగోళ్లకు రూ.10 కోట్లు మంజూరు

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో మార్క్‌ఫెడ్ ద్వారా ఉల్లి కొనుగోలుకు ప్రభుత్వం రూ.10 కోట్లు మంజూరు చేసింది. ధరల స్థిరీకరణ నిధి కింద ఈ మొత్తాన్ని మంజూరు చేస్తూ జీఓ ఆర్‌టీ నంబరు 786 జారీ చేసింది. మార్కెట్‌లో ఉల్లి కొనుగోళ్లకు సంబంధించి జిల్లా స్థాయి కమిటీ ఏర్పాటైంది. చైర్మన్‌గా జిల్లా కలెక్టర్, వైస్ చైర్మన్‌గా జాయింట్ కలెక్టర్, కన్వీనర్‌గా జిల్లా మార్క్‌ఫెడ్ మేనేజర్, సభ్యులుగా మార్కెటింగ్ శాఖ రీజినల్ డిప్యూటీ డైరెక్టర్, జిల్లా ఉద్యాన అధికారి, మార్కెటింగ్ శాఖ జిల్లా అధికారి, మార్కెట్ కమిటీ సెక్రటరీ నియమితులయ్యారు.

ఇంటర్ విద్యార్థి బలవన్మరణం



మృతి చెందిన శ్యాంసుందర్

డోన్ టౌన్: బీసీ బాలుర కళాశాల వసతి గృహంలో ఉంటున్న ఇంటర్ విద్యార్థి శ్యాంసుందర్ (16) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పట్టణ సీఐ ఇంతియాజ్‌బాషా తెలిపిన వివరాల మేరకు.. అనంతపురం జిల్లా యాడికికి చెందిన చేనేత కార్మికులు రమేష్, సావిత్రి దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు శ్యాంసుందర్ డోన్ పట్టణంలోని ప్రభుత్వ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఇటీవల స్వగ్రామానికి వెళ్లిన విద్యార్థి ఆదివారం తిరిగి వసతి గృహానికి చేరుకున్నాడు. సోమవారం తెల్లవారుజామున బాత్ రూంలో శ్యాంసుందర్ ఉరేసుకుని కనిపించాడు. ఉదయం కాలకృత్యాల కోసం బాత్‌రూంకు వెళ్లిన విద్యార్థులు గమనించి హాస్టల్ వార్డెన్ మేరీ సూర్యకుమారి, విద్యార్థి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. విషయం తెలుసుకున్న సీఐ ఇంతియాజ్‌బాషా, ఎస్ఐలు శరత్‌కుమార్ రెడ్డి, నరేంద్రకుమార్, ఆర్డీఓ నరసింహులు, సాంఘిక సంక్షేమశాఖ అధికారులు అక్కడికి చేరుకుని విచారణ చేపట్టారు. అనంతరం తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రి మార్చురీకి తరలించారు. కాగా విద్యార్థి మృతిపై తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాలు, బీజేపీ నాయకులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. సమగ్ర దర్యాప్తు చేపట్టాలని హాస్టల్ ఎదుట ఆందోళన చేశారు. అన్ని కోణాల్లో విచారించి పూర్తి స్థాయిలో దర్యాప్తు చేపడతామని సీఐ తెలిపారు.

తల్లి మందలించిందని కుమారుడి ఆత్మహత్య



భాస్కర్

కోడుమూరు రూరల్: చెడు అలవాట్లకు బానిస కావొద్దు అని తల్లి మందలించడంతో కుమారుడు భాస్కర్ (22) ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషాదకర ఘటన కోడుమూరులోని బీసీ కాలనీలో సోమవారం ఉదయం చోటు చేసుకుంది. భాస్కర్ చిన్న చిన్న వయసులో ఉన్నప్పుడే తండ్రి రాముడు మృతి చెందాడు. దీంతో తల్లి కమలమ్మ కూలి పనులు చేసుకుంటూ ఒక్కగానొక్క కుమారుడిని పెంచారు. భాస్కర్ కూడా గౌండా పనిచేస్తూ తల్లికి చేదోడువాదోడుగా ఉండేవాడు. ఇటీవల భాస్కర్ చెడు అలవాట్లు బానిసై మద్యం తాగుతుండడంతో తల్లి కమలమ్మ మందలించింది. దీంతో మనస్తాపం చెందిన కుమారుడు భాస్కర్ సోమవారం ఉదయం తమ నివాసం పక్కనే ఉన్న మరో గుడిసెలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఒక్కగానొక్క కుమారుడు మృతి చెందాడని తెలిసి తల్లి కమలమ్మ శోకసంద్రంలో మునిగిపోయారు. కోడుమూరు పోలీసులు ఘటనా స్థలాన్ని సందర్శించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

శిథిల 'బడి'



తరగతి గదుల్లో భారీగా పెచ్చులూడిన దృశ్యం, కొద్దిరోజుల క్రితం హెచ్ఎం గదిలో కిందపడిన పెచ్చులు

కోడుమూరు మండలంలోని అమడగుంట్ల హైస్కూల్లో తరగతి గదులు పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి. ఈ పాఠశాలలో 325 మంది విద్యార్థినీ, విద్యార్థులు ఉండగా వీరికి 16 మంది ఉపాధ్యాయులు విద్యను బోధిస్తున్నారు. పాఠశాలలోని ఐదు గదుల్లోనే తరగతులు నిర్వహించడం కష్టంగా మారింది. విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు భవనం పై కప్పు నుంచి వర్షపు నీరు కారింది. గత నెల 17న హెచ్ఎం గదితో పాటు మరో రెండు తరగతి గదుల్లో భారీగా పెచ్చులూడిపడ్డాయి. ఆరోజు సెలవు వడంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఊపిరి పీల్చుకున్నారు. తరగతి గదుల్లో భారీగా పెచ్చులూడిపడుతుండడంతో ప్రమాదాన్ని గ్రహించిన ఉపాధ్యాయులు ముందస్తుగా గదులను ఖాళీ చేయించి బాగున్న తరగతి గదుల్లోకి విద్యార్థులను తరలించి అక్కడ విద్యాబోధన చేస్తున్నారు. హైస్కూల్లోని తరగతులు పూర్తిగా శిథిలావస్థకు చేరిన విషయాన్ని జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు ప్రధానోపాధ్యాయుడు అనంతయ్య తెలిపారు.

– కోడుమూరు రూరల్



అమడగుంట్ల హైస్కూల్



శిథిలమైన గదులకు తాళాలు వేసిన దృశ్యం